క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 31న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. ఎన్జీవోస్ కాలనీ, సంఘమిత్ర కాలనీ, కబ్రస్థాన్, శ్రీలక్ష్మి నగర్, రాజు కిరాణం, మసీదు ప్రాంతం, నయీంనగర్, శ్రీనగర్ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, పోచమ్మకుంట, ఈద్గా ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. క్రిస్టియన్ కాలనీ, ఎస్ఆర్‌నగర్, డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రాంతం, 100 ఫీట్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

3న జీపీ కార్మికుల మహాసభలు

న్యూశాయంపేట: ఆగస్టు 3న తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా 2వ మహాసభలు హనుమకొండలో జరుగుతాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.చక్రపాణి తెలిపారు. ఈ మేరకు మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. హనుమకొండ సుందరయ్య భవన్‌లో గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పల్లె రామన్న అధ్యక్షతన బుధవారం జరిగిన యూనియన్ జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా కార్యదర్శి జి.యాకయ్య, నాయకులు బి.సాంబయ్య, బి.రమేష్, ఐలయ్య, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆదిమూల గణపతికి లక్షగరిక పూజలు



కాజీపేట: 62వ డివిజన్ విష్ణుపురి కాలనీలోని స్వయంభూ శ్వేతార్క మూల గణపతి దివ్యక్షేత్రంలోని ఆదిమూల గణపతికి బుధవారం లక్ష గరికలతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసోత్సవాన్ని పురస్కరించుకుని దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో పండితులు దూర్వాగణపతి వ్రతం జరిపించారు. ఆస్థాన గాయకులు మహతి, కళ్యాణి భక్తిపాటలు ఆలపించారు. భక్తులకు అన్నపూర్ణ కేంద్రంలో మహాన్నదానం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణశర్మ, సాయికృష్ణశర్మ, భక్తులు దేవులపల్లి సదానందం, శనిగరపు రాజ్‌మోహన్, తుమ్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెడికవర్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు

కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మెడికవర్ ఆస్పత్రి యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా మెడికవర్ ఆస్పత్రి వేదికగా న్యూరో సర్జరీ, న్యూరాలజీ, కార్డియాలజీ, సీటీవీఎస్ సర్జరీ, యూరాలజీ, నెఫ్రాలజీ, సర్జికల్, అంకాలజీ తదితర ప్రత్యేక వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొంది.

జీఓ 60 ప్రకారం కార్మికులకు వేతనాలివ్వాలి

న్యూశాయంపేట: ఎంజీఎంలో పనిచేస్తున్న కార్మికులకు జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారదకు బుధవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సింగారపు బాబు, సుమన్, బి.కుమార్, చింత అశోక్, సమ్మయ్య, భిక్షపతి, రమాదేవి, పుష్ప, వినోద, సాంబరాజు, మహేందర్, సతీష్, రమేష్, లక్ష్మి, విజయ్, సందీప్, జోసెఫ్, అనిల్‌కుమార్, రత్నాకర్, కిన్నెర పాల్గొన్నారు.

జాతరకు ఏర్పాట్లు చేయండి



ఖిలా వరంగల్: రజకుల కులదైవమైన మడేలయ్య జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్లి రవి తెలిపారు. కార్పొరేటర్‌ను రజక సంఘం నాయకులు బుధవారం కలిసి జాతర ఏర్పాట్లపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయిస్తానని, నగర మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌ను వేర్వేరుగా కలిసి వారి సహకారం కోరనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాముల బాబు, సదానందం, మల్లేశం, కొండమీది యాదగిరి, మురళి, శంకర్, కృష్ణ, సాంబమూర్తి, రమేష్, బసవరాజు, భిక్షపతి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

దారులే.. ఏరులై





64వ డివిజన్ మడికొండలోని సాయి ఆర్చిడ్ కాలనీలో రోడ్లపై పారుతున్న వరద నీరు

- సాయి ఆర్చిడ్ కాలనీలో రోడ్లపై పారుతున్న వరద
- సైడ్ డ్రెయినేజీలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు

మడికొండ: గ్రేటర్ వరంగల్ 64వ డివిజన్ మడికొండ సాయి ఆర్చిడ్ కాలనీలు వాసులు వరద నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. కాలనీలో అంతర్గత రోడ్లు నిర్మించి సైడ్ డ్రెయినేజీలను ఏర్పాటు చేయలేదు. దాంతో పక్కనే ఉన్న లోతుకుంట బ్యాక్ వాటర్ కాలనీలోని అంతర్గత రోడ్లపై పారుతోంది. ఒక్కోసారి ఇంట్లోకి కూడా వరద వస్తోంది. ఈ సమస్యను గతంలో అప్పటి ఎమ్మెల్యే అరూరి రమేష్ దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే నాగరాజు తమ కాలనీ వైపు కనీసం కన్నెత్తి కూడా చూడటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద నీరు పారకంతో రోడ్లపై పాకురు ఏర్పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పాదచారులు, పిల్లలు, వృద్ధులు జారి పడుతున్న సంఘటనలు అనేక ఉన్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సైడ్ డ్రెయినేజీలు నిర్మించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న లీగల్ సెల్ బాధ్యులు

వరంగల్ లీగల్: రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యంగా ఆగస్టు 2న న్యూఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో ఏఐసీసీ లీగల్ సెల్ జాతీయ చైర్మన్ అభిషేక సింఘ్వీ ఆధ్వర్యంలో జరగనున్న జాతీయ సదస్సును విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ చైర్మన్ శామంతుల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ హాల్‌లో సదస్సు వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ హాజరయ్యే ఈ సదస్సుకు తెలంగాణ లీగల్ సెల్ రాష్ట్ర చైర్మన్ పొన్నం అశోక్‌గౌడ్ పిలుపు మేరకు జిల్లా నుంచి న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొనాలని శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ కొక్కొండ రమేష్, రాష్ట్ర కన్వీనర్లు ముదసిర్ అహ్మద్, పోషిని రవీందర్, రాజోజు వేణుగోపాల్, కూనూరు రంజిత్‌గౌడ్, రాష్ట్ర వైస్ చైర్మన్లు నల్ల మహాత్మ, తోట రాజ్‌కుమార్, నిమ్మాని శేఖర్‌రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి వేముల రమేష్, నాయకులు పాల్గొన్నారు.

చెట్లతోనే మానవ మనుగడ



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ, తదితరులు

హసన్‌పర్తి: చెట్లను నరికివేయడం వల్లే వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ పాఠశాలలో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కనీసం రెండు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ మాట్లాడుతూ చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని అన్నారు. హెచ్‌ఎం ఆకుతోట శాంతరాంకర్ల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉప ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ధర్నా కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

కాజీపేట అర్బన్: ఆగస్టు 5వ తేదీన ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నా కరపత్రాలను ఎంఈఓ మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆవిష్కరించారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి హనుమకొండలోని ఏకశిల పార్కు వద్ద తలపెట్టిన ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రవీందర్‌రాజు, కార్యదర్శి సదానందం, రాజగోపాల్, సురేందర్ రెడ్డి, వెంకటరమణ, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మకుంటలో బోనాల సందడి



బోనాలతో తరలివెళ్తున్న భక్తులు

నయీంనగర్: 54వ డివిజన్ పోచమ్మకుంటలో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగను బుధవారం నిర్వహించారు. ఆలయానికి బోనాలతో తరలివెళ్లి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలను రక్షించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కందికొండ వేణుగోపాల్, కార్పొరేటర్ సోదా కిరణ్, కుసుమ లక్ష్మీనారాయణ, అశోక్, శ్రీను జనార్దన్, శ్రీధర్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

కాళోజీ యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు వినతి



కేయూ క్యాంపస్: రాష్ట్రంలో నీట్ ఆధారంగా చేపట్టే అడ్మిషన్లలో ఎస్సీ రిజర్వేషన్ల ఉపప్రాతిపదికన తీసుకోకూడదని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ బాధ్యులు కోరారు. ఈమేరకు వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు ఆరోగ్య యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేసినట్లు సంఘం బాధ్యులు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ మందాల భాస్కర్ మాట్లాడుతూ ఎస్సీ ఉప వర్గీకరణను నీట్ అడ్మిషన్ల ప్రక్రియలో అమలు చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో జేఏసీ బాధ్యులు చెరుకు రాంచందర్, బేర బాలకిషన్, చేపూరి నర్సింహా, మాల మహానాడు గ్రేటర్ వరంగల్ అధ్యక్షుడు రాంచందర్, జాతీయ ఉపాధ్యక్షుడు బాబురావు, కేయూ మాల విద్యార్థి సంఘం బాధ్యులు వెంకటేశ్వర్లు, అనిల్, మేడ రంజిత్, చంద్రమౌళి, గరిక అనిల్, అనిత, కుమార్, సాంబయ్య పాల్గొన్నారు.

ప్రజానాట్య మండలి ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహకు సన్మానం

న్యూశాయంపేట: తెలంగాణ యువజన, పర్యాటక సాంస్కృతిక శాఖ సలహామండలి సభ్యుడిగా నియమితులైన తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ మొదటి సారి హనుమకొండ జిల్లాకు వచ్చిన సందర్భంగా సీపీఐ నాయకులు, జిల్లా ప్రజానాట్య మండలి నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు, జిల్లా కార్యదర్శి కే.భిక్షపతి, నాయకులు కొట్టెపాక రవి, తోట భిక్షపతి, వస్కుల భరత్, తాటికాయల మమత, కళాకారులు పాల్గొన్నారు.

ఎస్సై చంద్రమౌళికి శుభాకాంక్షలు

మడికొండ: మడికొండ పోలీసు స్టేషన్‌లో ఏఎస్సై నుంచి ఎస్సైగా పదోన్నతి పొందిన చంద్రమౌళి బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఆయనను బీజేపీ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, గడ్డం కిరణ్, గోపనబోయిన రాజు బుధవారం సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

'నా పేరును పరిశీలించండి'

హసన్‌పర్తి: కాంగ్రెస్ హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి కోసం తన పేరును పరిశీలించాలని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి కోరారు. ఈ మేరకు పార్టీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. 35 ఏళ్లుగా పార్టీలో తాను కొనసాగుతూ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తునట్లు పేర్కొన్నారు.

బస్సుల్లో విద్యార్థినులపై ఈవ్‌టీజింగ్

- షీటీమ్‌తో ఆకతాయిల నుంచి రక్షణ కల్పించాలని కోరుతున్న విద్యార్థినులు

కాజీపేట: ఇటీవలి కాలంలో ఆర్టీసీ బస్సుల్లో యువకుల ఈవ్‌టీజింగ్ శ్రుతిమించడంతో విద్యార్థులు, యువతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో కళాశాలలకు రాకపోకలు సాగించే సమయాల్లో ఆర్టీసీ బస్సుల్లో యువతులపై యువకులు ఈవ్‌టీజింగ్ పాల్పడుతున్నారు. కళాశాలలకు వచ్చిపోయే సమయాల్లో బస్సులు రద్దీగా ఉండడాన్ని అవకాశంగా మలుచుకుని మీదపడడం, ద్వంద్వార్థాలతో హేళన చేస్తూ పోకిరీలు ఇబ్బందులు పెడుతున్నారని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోకిరీల ఆట కట్టించాలి

వరంగల్ నుంచి కాజీపేటకు రాకపోకలు సాగిస్తున్న లోకల్ బస్సుల్లో ఆడపిల్లలు ప్రయాణించడం ఇబ్బందిగా మారిందంటున్నారు. బస్సుపాసులు ఉండటంవల్ల విధిలేని పరిస్థితుల్లో రద్దీగా ఉన్నప్పటికీ ప్రయాణం చేయక తప్పడం లేదంటున్నారు. దీన్ని తమకు అనుకూలంగా మల్చుకుంటున్న ఆకతాయిలు విద్యార్థునులను వేధిస్తూ పైశాచిక ఆనందం పొందుతుండడం ఆందోళన కలిస్తున్న అంశం. ఇలాంటి చిన్నచిన్న సమస్యలను బయటకు చెప్పలేక లోలోపల అనేకమంది అమ్మాయిలు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల క్రితం జనగామ నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సులో యువతులను వేధిస్తున్న ఇద్దరు యువకులకు బస్సులోని ప్రయాణికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఇలాంటి ఘటనలు నిత్యం జరుగుతున్నా బయటకు రాకపోవడం శోచనీయం. ఫలితంగా కొంతమంది యువతులు ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. పోలీసులు చొరవ తీసుకుని మఫ్టీలో ఉన్న షీటీం పోలీసులను బస్సుల్లో సాధారణ ప్రయాణికుల్లా పంపించి ఆడపిల్లలను వేధింపులకు గురిచేస్తున్న తుంటరీల ఆట కట్టించాలని పలువురు విద్యార్థినులు కోరుతున్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

- వరంగల్ రైల్వే స్టేషన్‌లో అగ్ని ప్రమాదాలపై మాక్‌డ్రిల్



అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ అధికారులు

ఖిలా వరంగల్: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలు, ప్రయాణికులు అవగాహన కలిగి ఉండాలని ఆర్పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ ఆర్.సుభాష్, డిప్యూటీ సూపరింటెండెంట్ కృపాకర్ సూచించారు. వరంగల్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో వరంగల్ జిల్లా అగ్నిమాపక శాఖ, ఆర్పీఎఫ్, జీఆర్పీ సంయుక్త ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై నివారణ చర్యలు, జాగ్రత్తలపై ప్రయాణికులకు అవగాహన కలిస్తూ మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, మంటలు అంటుకునే వస్తువులను దూరంగా ఉంచాలని, తప్పించుకోవడానికి మార్గాలకు అడ్డంకులు లేకుండా చూసుకోవాలని అన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. అనంతరం అగ్ని ప్రమాదాల నుంచి తప్పించుకునే యత్నాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శన ద్వారా చూపించారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌గౌడ్, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సురేందర్, ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ సుక్ర, మట్టెవాడ ఫైర్ స్టేషన్ అధికారి నవీన్, ఆర్పీఎఫ్ ఎస్సైలు వెంకటేశ్వర్లు, రైల్వే వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు

ఎన్‌సీసీ కేడెట్ల విన్యాసాలు అద్భుతం



విన్యాసాలు చేస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

- కేయూ ఓఎస్‌డీ ప్రొఫెసర్ మల్లారెడ్డి
- కొనసాగుతున్న ఎన్‌సీసీ క్యాంపు

కేయూ క్యాంపస్: ఎన్‌సీసీ కేడెట్లు చేస్తున్న విన్యాసాలు అద్భుతంగా ఉన్నాయని, ఎంతో స్ఫూర్తిని కలిగిస్తున్నాయని కాకతీయ యూనివర్సిటీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ) ప్రొఫెసర్ మల్లారెడ్డి అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో 10వ బెటాలియన్ వరంగల్ గ్రూప్ ఆధ్వర్యంలో పదిరోజుల ఎన్‌సీసీ కేడెట్ల క్యాంపు కొనసాగుతోంది. ఆగస్టు 2వ తేదీ వరకు కమాండెంట్ కల్నల్ ఎస్ఎస్.రామదురై నేతృత్వంలో కొనసాగనుంది. ఈ క్యాంపును మల్లారెడ్డి బుధవారం సందర్శించి మాట్లాడారు. క్రమశిక్షణ, దేశభక్తి పెంపునకు ఎన్‌సీసీ శిక్షణ దోహద పడుతుందని అన్నారు. వీర్‌చక్ర శిక్షణా పద్ధతులు, ఫైరింగ్, డ్రిల్, కల్చరల్ కార్యక్రమాలు, బెస్ట్ కేడెట్, ఫ్లాగ్ ఏరియా, క్యాంప్ లొకేషన్‌ను వరంగల్ గ్రూప్ కమాండర్ కల్నల్ సచిన్ అన్నారావ్ నేంబర్కర్ తనిఖీ చేశారు. శిక్షణ కార్యక్రమంలో కమాండింగ్ అధికారులు ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రవిసునారే, కెప్టెన్ డాక్టర్ సతీష్, కెప్టెన్ సదానందం, మేజర్ జైరామ్ సింగ్, కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ రాజ్‌కుమార్, పాలక మండలి సభ్యురాలు బి.రమ, అసోసియేట్ ప్రొఫెసర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



కాజీపేట: 63వ డివిజన్ బాపూజీనగర్ వెంకటలక్ష్మి కూరగాయల మార్కెట్ దారిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ బుధవారం ప్రారంభించారు. రూ.40 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, మార్కెట్ అధ్యక్షుడు నిషాని భిక్షపతి, కాంగ్రెస్ నాయకులు పోగుల రాకేష్, బర్ల సరోజనీ రెడ్డి, భద్రయ్య, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.



TOP IN TRI CITIES Special


















దాడి కేసులో రౌడీ షీటర్ వంశీ అరెస్ట్



ఖిలా వరంగల్: ఓ వ్యక్తిపై బ్లేడ్‌తో దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన రౌడీషీటర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం వరంగల్ రంగశాయిపేట ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ చాగంటి వంశీ.. మే 17న మరో రౌడీషీటరైన ఎండీ.ఇంతియాజ్‌పై బ్లేడ్‌తో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రెండు నెలలుగా దొరకకుండా తిరుగుతున్న చాగంటి వంశీని బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు. రౌడీ షీటర్ పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సైలు శ్రీకాంత్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణం, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096

Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

ఎల్. రాకేష్ వర్మ (SR) : 9885438059 (హన్మకొండ)
వి. రాజ్ కుమార్ (SR) : 9966290903 (హన్మకొండ)
కె. రవీందర్ (SR) : 9705236356 (వరంగల్)
పి.చంద్రశేఖర్ (ACO) : 9963646944 (వరంగల్)